క్లుప్తంగా

ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఏటూరునాగారం: మండల ఐటీడీఏ ఆధ్వర్యంలో యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సోలార్, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ నవీన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18–28 సంవత్సరాల వయసు లోపు వారు అర్హులన్నారు. ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు 9701603940, 7337255477 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఏజెన్సీ ముద్దు బిడ్డ బొజ్జి



వాజేడు: ఏజెన్సీ ముద్దు బిడ్డ మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సూడి కృష్ణారెడ్డి అన్నారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి ద్వితీయ వర్ధంతిని మండలంలో బుధవారం నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ నీతి, నిజాయితీకి మారు పేరు కుంజా బొజ్జి అన్నారు. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. నేటి తరానికి ఆయన ఆదర్శ ప్రాయుడని కొని యాడారు. కుంజా బొజ్జి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దబ్బ కట్ల లక్ష్మయ్య, పేదం రమాదేవి. కొప్పుల రఘుపతి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వాజేడు: వేసవిలో ఎండలు పెరుగుతున్న క్రమంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై రేక అశోక్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన చలి వేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు, ప్రయాణికులకు తాగునీరు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీను, సతీష్, సారయ్య, వెంకట రెడ్డి ఉన్నారు.

ఆహ్వాన పత్రాల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మల్లీశ్వరి చేతుల మీదుగా వైద్యఆరోగ్య సిబ్బంది ఆహ్వానపత్రాలను అందించారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు

కన్నాయిగూడెం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి కన్నాయిగూడెం మండలానికి నూతనంగా బస్సు సర్వీస్‌ను బుధవారం అధికారులు ప్రారంభించారు. బస్సుసర్వీస్ రావడంతో మండల ప్రజలు సంతోషిస్తున్నారు. ఎన్నో గంటలు పట్టే ప్రయాణం పలిమెల మండలం నుంచి వెళ్లడంతో ప్రయాణం సులువుగా చేరుకుంటున్నామని ప్రయాణికులు అంటున్నారు. ఈ సర్వీస్‌తో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వెళ్లే ప్రయాణికులకు సులువు అవుతుంది. రోజుకు రెండు సర్వీస్‌లు మాత్రమే వస్తున్నాయని మరో సర్వీస్ పెంచి లక్ష్మీపురం వరకు కాకుండా మండల కేంద్రం కన్నాయిగూడెం వరకు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'నిరుద్యోగ మార్చ్'ను విజయవంతం చేయాలి

ములుగు రూరల్: ఈ నెల 15న భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా క్రిష్ణవేణి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చెట్టు పైనుంచి పడి ఒకరికి గాయాలు

ఏటూరునాగారం: తునికిచెట్టుపై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆకులవారిఘణపురం తాళ్లగడ్డకు చెందిన బొగ్గుల రామకృష్ణ తన మిత్రులతో కలిసి తునికిపండ్లు కోసేందుకు బుధవారం సమీపంలోని అడవికి వెళ్లాడు. మధ్యాహ్నం అడవిలో తునికిచెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా కాలుజారి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో పడి ఉన్న రామకృష్ణను తోటి స్నేహితులు సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స అందించి విషమంగా ఉందని ఎంజీఎంకు రెఫర్ చేశారు. బాధితుడికి వివాహం కాగా ఇటీవలే కూతురు పుట్టిందన్నారు.

ఇసుక తవ్వకాల్లో అవకతవకలు

- అనుమతులు ఒక చోట.. పనులు మరో చోట
- పర్యవేక్షణను వదిలేసిన అధికారులు



ముప్పనపల్లిలో కేజీబీవీ భవనానికి అక్రమంగా తరలించిన ఇసుక

కన్నాయిగూడెం: మండలంలో ఇసుక సూరులు మితిమీరి పోతున్నారు. అనుమతులు ఒక చేట తీసుకొని మరో చోటుకు తరలిస్తున్నారు. ఎవరైనా అనుమతులు ఉన్నాయా అని అడిగితే ఉన్నాయంటూ వారినే బుకాయిస్తు ఇసుకను తరలిస్తున్న సంఘటనలు మండలంలోని బుట్టాయిగూడెం హనుమంతుని వాగు నుంచి యధేచ్ఛగా సాగుతున్నాయి. మండలంలోని ముప్పనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు–మన బడిపనులు కొనసాగుతున్నాయి. ఈ పనులకు ప్రభుత్వం నుంచి ఇసుకకు ఖచ్చితంగా అనుమతి ఇస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఆ పనుల కోసమని అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్ అదే గ్రామంలో కొనసాగుతున్న కేజీబీవీ భవనానికి ఇసుకను తరలించారు. అసలు విషయం ఇక్కడే మొదలైంది. రెండు పనులు ఒకే కాంట్రాక్టర్ కావడంతో కేజీబీవీకి డీడీలు తీసి తరలించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతర్ చేస్తూ సుమారు 10 ట్రాక్టర్ల వరకు అక్రమంగా తరలించారు. ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ అధికారిని వివరణ కోరగా మా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి అక్రమంగా కేజీబీవీకి తరలించినట్లు రుజువైతే ఇసుకను సీజ్ చేసి, సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బైరి వీరస్వామి తెలిపారు. గతంలో కూడా అనుమతులు లేకుండా అర్ధరాత్రి జేసీబీతో హనుమంతుని వాగు నుంచి ఇసుకను తరలిస్తే ఇదే అధికారులు సీజ్ చేసి ఫైన్ వేసిన సంఘనలు లేక పోలేదు. ఇప్పుడు కూడా ఇది నిజమని తేలితే చర్యలు ఎలా ఉంటాయో వేచిచూడాలని మండల ప్రజలు చూస్తున్నారు.

వడదెబ్బపై కూలీలకు అవగాహన



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారిణి యమున

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గోదావరి ఒడ్డు వెంట మిర్చి తోటల్లో మిర్చి ఏరుతున్న కూలీలకు వడదెబ్బపై పీహెచ్‌సీ వైద్యాధికారి యమున బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీ సిబ్బందితో చుంచుపల్లి, కొత్తమల్లూరు సమీపంలోని మిర్చి తోటల్లో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వడదెబ్బకు గురైన లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక ఏఎన్ఎంను సంప్రదించాలని లేదా పీహెసీలో చేర్పించి తగిన వైద్యం పొందాలన్నారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పలు ఆరోగ్య సమస్యలకు మందులను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, హెచ్‌వీ ముత్తమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ములుగు రూరల్(గోవిందరావుపేట): ఉద్యోగ సాధనకు ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువత ప్రణాళికాబద్ధంగా చదివి విజయాలను సాధించాలని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్య దేవ్‌సింగ్ అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండలంలో సుమారు 60 మంది నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో దొంతి విజేందర్‌రెడ్డి, రవి, అనీల్ , రాంకుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిటమట రఘు

ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని, నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, నాయకులు రియాజ్, సరికొప్పుల శ్రీనివాస్, మధుబాబు, రాంబాబు ముత్తేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం బుస్సాపూర్‌కు చెందిన పాలెం రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని శ్రీ రామక్రిష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిశ రామక్రిష్ణ పరామర్శించారు. బుధవారం బాధిత కుటుంబానికి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. నిరుపేదలకు సహాయం అందించేందుకు ట్రస్టు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని అన్నారు. పరామర్శించిన వారిలో ట్రస్టు సభ్యులు రమేష్, నవీన్, నారాయణ, వీరస్వామి. మహేష్, నితిన్, తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్‌కు సన్మానం



మురళీకృష్ణను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏటూరునాగారం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బట్ట మురళీకృష్ణను బుధవారం మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాలకు ప్రభుత్వం నుంచి వచ్చే బీసీ కార్పొరేషన్ లోన్లను తక్షణమే రిలీజ్ చేయాలని, వెనుకబడిన బీసీ కులాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డిపల్లి రఘుపతి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంచెర్ల నాగేశ్వరరావు, అల్లంల చంటి, రెబ్బల సత్యం, నాగరాజు, మల్లేష్, రాజేష్, రాంబాబు, సారయ్య, రమేష్, సమ్మయ్య, వెంకన్న, భాగ్యం, వినోద్, గౌరయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

పలిమెల : మండల పరిధిలో ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి కనీసం 200 మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను పరిశీలించి త్వరగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో ఖాళీ బ్యాగుల్లో గింజలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు మదన్, శ్రీధర్, పీటల్ పాల్, రామ్, సల్మాన్ పాల్గొన్నారు.

వ్యాను బోల్తా.. ఇద్దరికి గాయాలు



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద బుధవారం కూరగాయల వ్యాన్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరగాయలను తీసుకొస్తున్న వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడి పోయింది. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నరేందర్‌కు ఘనసన్మానం

చిట్యాల: తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కట్కూరి నరేందర్‌ను చిట్యాల పద్మశాలీ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షుడు ఈగ కోటేశ్వర్, సంఘ సభ్యులు ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. నరేందర్ భవిష్యత్తులో ఇలాంటి పదవులు మరిన్ని అలంకరించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, కోశాధికారి సామల రాజేందర్, సామల రమేష్, నాగుల రమేష్, కందుల రమేష్, చింతకింది దశరథం, కొండబత్తుల రాజేందర్, చిప్ప విశ్వనాథం,సుధాకర్, శ్రీనివాస్, యాదగిరి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న బుర్ర రమేష్

భూపాలపల్లి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన కవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ హాజరైన కవులను సన్మానించారు. నిరుద్యోగులు, యువకులు పుస్తకపఠన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవులు సంజీవరావు, మొగిలి, రమేష్, గ్రంథ పాలకులు చంద్రమౌళి, శారద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌రాథోడ్

భూపాలపల్లి అర్బన్: నూతన జాతీయ విద్యావిధానంతో దేశం తిరోగమనం వైపు వెళ్తుందని వెంటనే దానిని రద్దు చేయాలని అఖిల భారత విద్యాహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణంలో బుధవారం జిల్లా స్థాయి విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విద్యావిధానంలో అనేక లోపాలు ఉన్నాయని విమర్శలు వస్తున్న తరుణంలో ఇక్కడి పాలకవర్గాలు ఎన్ఈపీ-2020ని అమలు చేయడంతో దేశ భవిష్యత్ తిరోగమనంలోకి వెళ్లిపోవడమే కాకుండా అనేక రకాల సంక్షోభాలకు కారణం అవుతుందన్నారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు, పరోక్షంగా ఉచిత నిర్బంధ విద్యాహక్కును తొలగించడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ప్రవీణ్‌కుమార్, భోగేశ్వర్, సేవానాయక్, తిరుపతి, కర్ణాకర్, రాజమల్లయ్య, రమణరెడ్డి పాల్గొన్నారు.



విరబూసిన కలువ పూలు

కాళేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడి వేడికి చెరువులు, వాగులు, బావులు వట్టిపోతున్నాయి. కానీ మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయం సమీపంలోని గుండం చెరువు నీటిలో కలువ పూలు తేలియాడుతూ భక్తులు, సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. భక్తులంతా కలువ పూల అందం చూడతరమా అంటూ ఎంజాయ్ చేస్తున్నాయి.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అనుబంధ సంఘాల అధ్యక్షులను ప్రకటిస్తున్న గుమ్మడి సోమయ్య

మంగపేట: మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అధిష్టానం ఆదేశాల మేరకు మండల కమిటీతో సమన్వయంతో పనిచేయాలని కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ సంఘాల మండల అధ్యక్షుల నియామకం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ చౌళం వెంటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షుడిగా ముత్తినేని ఆదినారాయణ, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పల్లికొండ యాదగిరి, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా హిదయ్‌తుల్లా, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా చాద మల్లయ్యను ఏకగ్రీవంగా ఎం పికైనట్లు సోమయ్య ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధక్షుడు జైరాంరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, కార్యదర్శి ఎంపెల్లి సమ్మయ్య, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, వెంకన్న, నాగేంద్రబా బు, పార్టీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, యానయ్య, భగవాన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న రణధీర్, చిరంజీవి

ఎస్ఎస్‌తాడ్వాయి: క్షయవ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యాధికారులు రణధీర్, చిరంజీవి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఏసీఎఫ్ క్యాంపు నిర్వహించారు. 42 మందికి శాంపిళ్లు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు, ఆకలి కాకపోవడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించి తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ కాక పోతే ఆరోగ్యం క్షీణించి ప్రాణాపాయ పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వ్యాధి బాధితులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, ఆశ నోడల్ పర్సన్ లక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ తిరుపతి, స్టాఫ్ నర్సు ప్రశాంతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



కేక్ కట్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వెంకటాపురం(కె): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సంజీవరావు అన్నారు. బధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ప్రొబెషనరీ కాలం నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు అందించామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సరేష్, ప్రవీణ్ , జనార్ధన్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తండ్రికి తలకొలివి పెడుతున్న కూతురు

వెంకటాపురం(ఎం): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తండ్రి మృతి చెందగా కూతురు తండ్రి చితికి తలకొరివి పెట్టింది. మండలంలోని లక్ష్మీదేవిపేటకు చెందిన గోగు దుర్గయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దుర్గయ్యకు కుమారులు లేకపోవడంతో ఏకైక కుమార్తె దేవిశ్రీ తలకొరివి పెట్టి కన్నతండ్రి రుణం తీర్చుకుంది. దుర్గయ్యకు ఇద్దరు భార్యలు పెద్ద సమ్మక్క, చిన్న సమ్మక్కలు ఉన్నారు. నిరుపేద కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని, దాతలు వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని నేతకాని సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు జిముడ రాజు, జిల్లా ఎరుకల సంఘం గౌరవ అధ్యక్షుడు కేతిరి సారయ్య, నేతకాని సంఘం నాయకుడు గోగు సమ్మయ్య కోరారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి విరాళం అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

టేకుమట్ల: గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కోరారు. బుధవారం రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో మేము సైతంలో భాగంగా సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని కూడళ్లలో, రద్దీ ప్రాంతంలో, గ్రామప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. అలాగే వ్యాపారులు తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో త్వరలోనే అందరి సహకారంతో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక సర్పంచ్ సుదబోయిన రజితరాజు, ఎంపీటీసీ హమీద్‌లు విరాళాన్ని ఎస్సైకి అందించారు. దాంతో గ్రామస్తులు, వ్యాపారులు. ట్రాక్టర్ ఓనర్లు అందించిన విరాళాల మొత్తం రూ. 99వేలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీకి ప్రత్యేక శిబిరం ఏర్పాటు

కాటారం: దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్ పంపిణీ కోసం మండల కేంద్రానికి సమీపంలోని మంథని, మహాదేవపూర్ వైపు ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు భూపాలపల్లి డిపో మేనేజర్ ప్రతిమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు బస్‌పాస్‌లకు సంబంధించిన ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ కల్గిన దివ్యాంగులు భూపాలపల్లికి రాకుండా ఈ శిబిరం ద్వారా బస్‌పాస్‌లు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్లు పొంది బస్‌పాస్‌లు తీసుకోని దివ్యాంగులు మండలంలో 410 మంది ఉన్నారన్నారు. వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.